క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న వెలుగు అసోసియేషన్ సభ్యులు

మెళియాపుట్టి: మండలంలోని కేరాసింగి పంచాయతీ పొగడవెల్లిలో గిరిజన చట్టాలు, హక్కులపై కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. అటవీ హక్కులు గిరిజనులకు ఎలా వర్తిస్తాయో వివరించారు. పోడు పట్టాలు పొందడం, రికార్డ్స్ ఆఫ్ రైట్స్, వాటి ఉపయోగాలను తెలియజేశారు. పలు హక్కుల కోసం దరఖాస్తులు ఎలా చేసుకోవాలో తెలిపారు. పలు రకాల కూరగాయలు, తదితర విత్తనాలను పంపిణీ చేశారు. రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు పెద్దసీది విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం సింహాచలం, ఉపాధ్యాయులు

పాతపట్నం: జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 25 మంది ఎంపికయ్యారని హెచ్ఎం బి.సింహాచలం మంగళవారం తెలిపారు. మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో పాఠశాల నుంచి అండర్-14, అండర్-17, అండర్-19లో పలు క్రీడల్లో ఎంపికయ్యారన్నారు. పాఠశాలలో విద్యార్థులను హెచ్ఎం, పీఈటీ మురళీమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐడీ కార్డుల పంపిణీ



ఐడీ కార్డులు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుతున్న 386 మంది విద్యార్థులకు మంగళవారం ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమకూర్చిన ఐడీ కార్డులను ఎంఈఓ శాంతారావు విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం పైడి వెంకటరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పవన్, గొద్దు శాంతారావు, రూపవతి, రాజేంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా జోగారావు



తహసీల్దార్‌ను అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు

హిరమండలం: హిరమండలం తహసీల్దార్‌గా ఎ.జోగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన హనుమంతురావు ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జోగారావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. జోగారావుకు రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

చెత్త సేకరణ బుట్టల ఏర్పాటు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీలో చెత్త వేయడానికి పది ప్రధాన కూడళ్లల్లో చెత్తబుట్టలను ఏర్పాటు చేసినట్లు ఈఓ రామచంద్రరావు మంగళవారం తెలిపారు. పంచాయతీ ప్రజలు బుట్టల్లో చెత్త వేసి పారిశుద్ధ కార్మికులకు సహకరించాలన్నారు. శిర్ల జోగారావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ క్లినిక్‌ల తనిఖీ



ప్రైవేట్ క్లినిక్ నిర్వాహకునితో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్

కొత్తూరు: మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ కినిక్‌లను కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రసన్నకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక సాయి ప్రజా వైద్యశాలలో వైద్యం వికటించి పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని పాతఘనసర గ్రామానికి చెందిన కిల్లారి తేజమ్మ ఇటీవల మృతి చెందారు. ప్రైవేట్ క్లీనిక్‌లను తనిఖీ చేసి నివేదిక అందివ్వాలని డీఎంహెచ్ఓ ప్రసన్నకుమార్‌కు ఆదేశించారు. ప్రైవేట్ క్లీనిక్‌లు, మందుల షాపులు, ల్యాబ్‌లను వైద్యాధికారి పరిశీలించారు. అర్హతకు మించి మందులు వినియోగించడం, వైద్యం అందివ్వడం, అనుమతి లేకుండా మంచాలు వేయడం, బయో మెడికల్‌ను సరైన పద్ధతిలో ఉపయోగించకపోవడం వంటివి గుర్తించారు. నిబంధనల మేరకే ప్రాథమిక వైద్యం అందివ్వాలని క్లీనిక్ నిర్వాహకులకు ఆదేశించారు. స్థాయికి మించి వైద్యం చేయకూడదన్నారు. ఏడు రోజులులోగా సరి చేసుకోవాలని సూచించారు.

సాగుతున్న పనులు..!

- ఆస్పత్రి భవనాలు పూర్తయ్యేదెప్పుడు?
- 40 శాతానికి పైగా పనులు పెండింగ్
- వినియోగంలోనికి రాని భవనాలు
- కాంట్రాక్టర్ నిర్లక్షమే కారణమంటున్న ఇంజినీరింగ్ అధికారులు



నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాలు

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి అదనపు భవనాల నిర్మాణ పనులు గత ఆరున్నరేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితి. ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించారు. ఈ గడువు దాటి ఆరు నెలలైంది. ఇప్పుడు డిసెంబర్ అంటున్నారు. ఆ సమయానికి అయినా భవనాలు పూర్తవుతాయా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఏపీఎంఎస్ ఐడీసీ ఇంజినీరింగ్ అధికారుల అంచనా మేరకు 60 శాతం పనులు అయ్యాయి. ఈ పనులు కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టారు. కూటమి ప్రభుత్వం రావడంతో పనులు మందగించాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.12.56 కోట్లు మంజూరు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో నరసన్నపేట ఏరియా ఆస్పత్రిని వంద పడకలుగా ఏర్పాటు చేయడంతోపాటు ప్రసూతి వార్డు వేరుగా నిర్మాణం చేపట్టడానికి రూ.12.56 కోట్లు మంజూరు చేసింది. 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఈలోగా ప్రభుత్వం మారింది. పనుల్లో జాప్యం అవుతోంది.



అసంపూర్తిగా ఉన్న లోపలి పనులు

ప్రధానంగా పాత భవనానికి, కొత్త భవనానికి కలిపే వంతెన నిర్మాణం కావాలి. విద్యుత్, వాటర్ సప్లై, టైల్స్ పనులు మందకొడిగా జరుగుతున్నాయి. ప్రహరీ నిర్మాణం మధ్యలోనే ఉంది. ఇంటర్నెల్ రోడ్లు నిర్మించాలి. ఆస్పత్రి పరిసరాలతోపాటు కొత్తగా నిర్మిస్తున్న ప్రసూతి వార్డు చుట్టూ అభివృద్ధి చేయాలి. ఆపరేషన్ థియేటర్లను నిర్మించాల్సి ఉంది.

సిబ్బంది అవస్థలు..

పనులు సాగుతుండటంతో వైద్యులు, సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. పాత భవనంపై మరో అంతస్తు వేశారు. దీంతో కింద ఉన్న అంతస్తుల్లో గల మరుగుదొడ్లలో వాటర్ పంపింగ్ సిస్టమ్ పాడైంది. పై అంతస్తులో గోడలు నిర్మించారే తప్ప.. లోపల పనులు పూర్తి కాలేదు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో 22 మంది వైద్యులున్నారు. ప్రత్యేక నిపుణులు పది మంది ఉన్నారు. వీరికి తోడు పీజీ చేస్తున్నవారు పది మందికిపైగా ఉంటున్నారు. వీరందరికీ సరిపడా రూమ్‌లు లేక ఇబ్బంది పడుతున్నారు. కంటి, దంత, ఆర్థో స్పెషలిస్టు వైద్యులకు వేరేగా సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ప్రసూతి వార్డు ప్రత్యేకంగా లేకపోవడం వలన గర్భిణులు, బాలింతలు, నర్సులు అవస్థలు పడుతున్నారు. వార్డులు ప్రత్యేకంగా లేక అందరికీ ఒకేచోట ఉంచాల్సి వస్తోంది.

ఇబ్బందులు పడుతున్నాం

ఆస్పత్రిలో సివిల్ పనులు జరుగుతుండటంతో ఇబ్బంది పడుతున్నాం. సిబ్బందికి, వైద్యులకు సరిపడా రూమ్‌లు లేవు. ఇటీవల కలెక్టర్ వచ్చి పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాలి. స్పెషలిస్టు వైద్యులు ఉన్నప్పటికీ రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించలేక పోతున్నాం.

– శ్రీనుబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్

డిసెంబర్ కల్లా పూర్తిచేస్తాం

ఆస్పత్రి భవనాలు ప్రస్తుతం 60 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు డిసెంబర్ కల్లా పూర్తిచేస్తాం. సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తున్నాం. ఇటీవల పనులు వేగవంతమయ్యాయి.

– వెంకటేష్, ఏఈ, ఏపీఎంఎస్ఐడీసీ

ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: రైతులకు అవసరమైన ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ క్రమ శిక్షణ కమిటీ అధ్యక్షురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలోకి చేరుకుంటున్న క్రమంలో ఎరువులు ఎంతో అవసరమన్నారు. జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు పడినా.. ఎరువుల కొరత వల్ల రైతులకు తీరని నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇదేనా సీఎం చంద్రబాబుకు ఉన్న సీనియార్టీ అని ఎద్దేవా చేశారు. జిల్లాలో యూరియాను కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు కూటమి నాయకులు తరలిస్తున్నారని విమర్శించారు. చివరకు అధికార పార్టీ నేతలు యూరియాను కూడా వదలడం లేదన్నారు. ఇప్పటికీ కార్యాలయాల ఎదుట రైతులు బారులుదీరి కనిపించడం బాధాకరమన్నారు. సకాలంలో ఎరువులు వేయకపోతే దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. రైతుల ఉసురు కూటమి ప్రభుత్వానికి తగులుతుందన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

హిరమండలం: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు విమర్శించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కొత్తూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో హిరమండలంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు సమ్మె చేసే సమయంలో కూటమి నాయకులు ఎన్నో ప్రకటనలు చేశారని, వాటిని అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జూలై నెలలో వేతనాలు పెంచుతామన్న హామీని ఈ ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీలకు యాప్‌ల భారం నుంచి తప్పించాలన్నారు. మెనూకు సంబంధించి పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లింపులు చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా పద్మారాణి, అధ్యక్షురాలిగా లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కె.వి.హేమలత, ఉపాధ్యక్షురాలుగా సుదీప్త, అరుణ, నీరజా, నిర్మల, లక్ష్మి, శశివర్ణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత



పాతపట్నం: గొడుగులతో ర్యాలీ నిర్వహిస్తున్న పాతపట్నం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



నరసన్నపేట: ఓ3 ఆకారంలో సత్యవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు అన్నారు. మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. సూర్యుడు నుంచి వచ్చే ప్రమాదకరమైన అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమిపై పడకుండా ఓజోన్ పొర కాపాడుతుందన్నారు. ఓజోన్ పొర రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గొడుగులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కల్పిస్తున్న జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యుడు పైల రవికుమార్

– సాక్షి నెట్‌వర్క్

విద్యుత్ ఉద్యోగుల నిరసన



పాతపట్నం: నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

మెళియాపుట్టి: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక విద్యుత్ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రేడ్-2 సచివాలయం జేఎల్ఎంలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, పెన్షన్ విధానాన్ని క్రమబద్ధీకరణ చేయాలన్నారు. పారుగు సేవలలో పని చేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను రెగ్యులైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐ డొంబురు, లైన్‌మన్ రాంబాబు, జేఎల్ఎంలు షిఫ్ట్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

పాతపట్నంలో..

పాతపట్నం: విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయవద్దని, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు, అర్బన్ ఎల్ఐ కె.అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాతపట్నం మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద నల్ల బాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. అప్పారావు మాట్లాడుతూ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత అపరిమిత వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. నిరసన తెలిపిన వారిలో ఏఈ రవీంద్ర, రూరల్ ఎల్ఐ జగన్, నేతాజీ, కిశోర్, తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

హిరమండలం: ఈ నెల 17వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు ప్రజావేదిక

సారవకోట: ఈ నెల 17వ తేదీన మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీఓ నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన మెటీరియల్ పనులు, వేతన రూపంలో చెల్లించిన నిధులకు సంబంధించి ప్రజా వేదిక ఉంటుందన్నారు.

కూరుకుపోయిన ఇసుక లారీ, ట్రాక్టర్



రహదారి మధ్యలో కూరుకుపోయిన లారీ, పొలంలో దిగబడిన ట్రాక్టర్

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు-కె పంచాయతీ పరిధి జర్రిభద్ర, రాయిగుడ్డి మధ్య ఇసుక లారీ, ట్రాక్టర్ కూరుకుపోయిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది.. జర్రిభద్ర, సవర జర్రిభద్ర, రాయిగుడ్డి గ్రామాలను కలుపుతూ రెండు కిలో మీటర్ల మేర రహదారి ఉంది. ఈ రహదారి పూర్తిగా పాడైపోయి ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని స్థితిలో ఉంది. జర్రిభద్ర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి లారీతో ఇసుక తెప్పించాడు. రహదారి మధ్యలో లారీ కూరుకుపోయింది. ట్రాక్టర్‌ను తీసుకువచ్చి ఇసుక తరలించి, లారీని బయటికి తీయాలని గ్రామస్తులు ప్రయత్నించారు. లారీ పక్క నుంచి వచ్చిన ట్రాక్టర్ పంట పొలంలో కూరుకుపోయింది. ప్రమాదం నుంచి డ్రైవర్ త్రుటిలో తప్పించుకున్నాడు. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం అతికష్టం మీద జేసీబీ సహాయంతో ఇసుక లారీ, ట్రాక్టర్‌ను బయటకు తీశారు.

గ్రానైట్ క్వారీకి అనుమతి ఇవ్వొద్దు

కొత్తూరు: మండలంలోని పొనుటూరుకు అనుకొని ఉన్న కొండలో గ్రానైట్ క్వారీ కోసం ప్రభుత్వం అనుమతి ఇవ్వొద్దని సర్పంచ్ ఎద్దు చామంతి, గ్రామస్తులు మంగళవారం కోరారు. గ్రానైట్ తవ్వకాల కోసం కొంతమంది వ్యక్తులు వచ్చి రాళ్ల సాంపిల్స్‌ను తీసుకువెళ్తున్నారని తెలిపారు. గ్రానైట్ క్వారీకి ప్రభుత్వం అనుమతి ఇస్తే మూడు గ్రామాల ప్రజలు ఉద్యమబాట పడతామన్నారు.

పరామర్శ..



చిన్నయ్యను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని అయ్యవారిపేట గ్రామానికి చెందిన గేదెల చిన్నయ్య ఇటీవల పాము కాటుకు గురయ్యారు. వైద్యం పొంది ఇంటికి వచ్చారు. ఆయనను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పొదల్లో సొసైటీ ట్రాక్టర్



కొత్తూరు పీఏసీఎస్‌కు చెందిన ట్రాక్టర్ గత కొన్నేళ్ల నుంచి పనిచేయక పోవడంతో పొదల్లోకి చేరింది. వ్యవసాయశాఖ ద్వారా పది సంవత్సరాల క్రితం పీఏసీఎస్‌కు ట్రాక్టర్‌తో పాటు దుక్కి సెట్‌ను అందించారు. పీఏసీఎస్‌లో ఉన్న రైతులు కొన్నాళ్లపాటు వీటిని ఉపయోగించారు. కొంత కాలం తరువాత ట్రాక్టర్ పాడవడంతో బాగు చేయలేదు. నిధులు లేకపోవడంతోనే ట్రాక్టర్‌ను పక్కన పెట్టినట్లు సీఈఓ నాగరాజు తెలిపారు. ట్రాక్టర్ పూర్తిగా పాడైందన్నారు. తిరిగి వ్యవసాయశాఖకు అప్పగిస్తామన్నారు.

– కొత్తూరు

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



పాతపట్నం నుంచి తెంబూరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

– పాతపట్నం

పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఈ చిత్రం చూడగానే పచ్చిక మైదానం మాదిరిగా కనిపిస్తోంది. ఇది సరుబుజ్జిలి మండలంలోని కొత్తకోట మినీ రిజర్వాయర్‌గా పిలుస్తున్న పెద్ద చెరువు. రిజర్వాయర్ నిండా గుర్రపుడెక్క పేరుకుపోయింది. దీంతో సుమారు 1,200 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటి కష్టాలు తప్పడంలేదు. అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

మురుగునీరు నిల్వ..



ఈ చిత్రం సారవకోట మండలంలోని తర్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న మురుగు నీరు. వర్షం నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేదు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో మురుగుగా తయారైంది. దీంతో వ్యాధులను వ్యాపింపజేసే దోమలు, ఈగలు పెరుగుతున్నాయి. దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– సారవకోట

సమస్యలు పరిష్కరించండి

హిరమండలం: గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ బడే సుసన్నా అన్నారు. స్థానిక ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వలంటీర్ విధులు, సర్వేల నుంచి విముక్తి కల్పించాలని, స్పష్టమైన జాబ్‌కార్డు అమలు చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల ప్రొబిషన్ కాలానికి సంబంధించి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. అక్టోబర్ నాటికి 6 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకునేవారికి ఆటోమేటిక్ స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బంది ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో న్యాయం జరగకపోతే రాష్ట్ర జేఏసీ కార్యాచరణకు అనుగుణంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

న్యాయం చేయాలని వినతి

హిరమండలం: జిరాయితీని గ్రామ కంఠంగా మార్చేశారని, దీనిని పరిశీలించి చర్యలు చేపట్టాలని ఎల్.ఎన్.పేట మండలం పెద్దకొల్లివలస పంచాయతీ పరిధిలోని మోదుగువలసకు చెందిన రైతులు విజ్ఞప్తి చేశారు. ఎల్.ఎన్.పేట తహసీల్దార్ కార్యాలయ అధికారులకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. భూముల రీసర్వేలో భాగంగా జరిగిన తప్పిదంతో గ్రామంలోని 1.99 ఎకరాలకు సంబంధించి రికార్డుల్లో తప్పులు దొర్లాయన్నారు. ఈ విషయంలో సబ్ కలెక్టర్ చొరవ చూపి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.



భూ పత్రాలను చూపుతున్న రైతులు